ఘనంగా గణతంత్ర వేడుకలు

- వాడవాడలా రెపరెపలాడిన త్రివర్ణ పతాకం
- విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పార్టీ కార్యాలయాల్లో జెండా వందనం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయజెండా ఎగురవేసి జెండా వందనం చేశారు. అనంతరం బొల్లా మాట్లాడుతూ ఎంతోమంది త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పరిపాలన జరుగుతుందని కూటమి ప్రభుత్వం ప్రత్యర్థులను టార్గెట్‌గా చేసుకొని ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం పనిగా పెట్టుకుందని, వినుకొండలో కూడా రషీదు హత్య కేసులో ముద్దాయిలను శిక్షించకుండా రషీదు అన్నపై కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాలు పనిచేయాలని సూచించారు. పార్టీ తరఫున అన్యాయాలను ఎదురించి ప్రతిఒక్కరికీ అండగా ఉంటామని అన్నారు. పార్టీ అధికార ప్రతినిధి ఎంఎన్ ప్రసాద్, సీనియర్ నాయకులు అమ్మిరెడ్డి అంజిరెడ్డి, గంధం బాలిరెడ్డి, ములకా రామతులసి రెడ్డి, దండు చెన్నయ్య, సానాల పుల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, ఎంఎస్‌కే బాషాలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెండావిష్కరణ చేసిన ఎమ్మెల్యే..


ఎంపీడీఓ కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: మండలంలో గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేసి గౌరవవందనం స్వీకరించారు. గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, రాజ్యాంగం ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఎంపీడీఓ టీవీ కృష్ణకుమారి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పలు విద్యాసంస్థల్లో..

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని విద్యాసంస్థల్లో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న త్యాగధనులను స్మరించుకొని నివాళులర్పించారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో పాలకవర్గ అధ్యక్షుడు జాతీయ జెండాను ఆవిష్కరించి ఎన్‌సీసీ క్యాడెట్స్ గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పెన్షనర్స్ భవన్‌లో జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మానం సుబ్బారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు లంకా రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.


చిలకలూరిపేట ఏఎంజీ హైస్కూల్‌లో జాతీయ నాయకుల చిత్రపటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నాదెండ్లలో...

నాదెండ్ల: దేశానికి అత్యున్నత రాజ్యాంగం అందించిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యాలయంలో ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీఓ స్వరూపరాణి, ఎంఈఓ కృష్ణారెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఏవీ రమణ, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ జి.పుల్లారావు జాతీయ జెండాను ఎగురవేశారు. నాదెండ్ల జెడ్పీ హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో ఆర్‌ఎంపీ నల్లమోతు నారాయణస్వామి పాఠశాలకు మైక్‌సెట్‌ను హెచ్‌ఎం నిర్మలకు అందించారు. గణపవరం జెడ్పీ హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థుల పెరేడ్ ఆకట్టుకుంది. హెచ్‌ఎం ఐ.కృష్ణానాయక్ పాల్గొన్నారు. సీఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, డైరెక్టర్ చుండి రంగనాయకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: గణతంత్ర వేడుకలు ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్, పోలీస్, తహసీల్దార్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో ఆ కార్యాలయాల ఉన్నతాధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలను, ఆయన రచించిన రాజ్యాంగం గొప్పతనాన్ని స్మరించుకున్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో రిపబ్లిక్ డే వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏఎంజీ హైస్కూల్‌లో ఏఎంజీ బోర్డు మెంబర్ డాక్టర్ ఎస్.సత్యదీప్తి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వికాస్ స్కూల్‌లో స్కూల్ డైరెక్టర్ దండా పవన్‌కుమార్ రిపబ్లిక్ డే ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: మండలంలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలు నిర్వహించి మువ్వన్నెల జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.నిర్మల, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.మ్యాథ్యూబాబు, పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ మణివర్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుభాని, ఏపీ మోడల్ స్కూల్‌లో పిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ జాతీయ జెండాలను ఎగురవేశారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

శావల్యాపురంలో..

శావల్యాపురం: భారతదేశ ఆర్థిక ప్రగతి సాధించటానికి రాజ్యాంగం ఎంతో కీలకమని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు ముండ్లమూరి అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం 76వ గణతంత్ర వేడుకలు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, డిప్యూటీ తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు, ఎంఈఓ య.సాంబశివరావు, వైద్యాధికారి ఎం.రాధాకృష్ణన్, విద్యుత్ ఏఈ నటరాజ్, ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తివర్ణ పతకాలను ఆవిష్కరించారు. వేల్పూరు గ్రామం సచివాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి. బీజేపీ మండల అధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు, శావల్యాపురం బస్టాండ్ సెంటరులో వైఎస్సార్ సీపీ నేత జుజ్జురి రామమూర్తి వేడుకల్లో పాల్గొన్నారు.

నూజెండ్లలో...

వినుకొండ(నూజెండ్ల): గణతంత్ర వేడుకలు నూజెండ్ల మండలంలో ఘనంగా జరిగాయి. తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ పార్థసారధి, జిల్లా పరిషత్ స్కూల్ హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, మోడల్, కస్తూర్బా స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ, ఉషారాణి, వైద్యాధికారి మాలకొండయ్యలు ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రుల్లో త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి పాల్గొని మాట్లాడారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మండలంలో 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద సంబంధిత శాఖల అధికారులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండలో..

వినుకొండ(నూజెండ్ల): గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్, ఎక్సైజ్, పోలీసు స్టేషన్లతో సహా పలు కార్యాలయాల్లో రిపబ్లిక్ డే సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ సురేష్, సీఐ శోభన్ బాబు, ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో...

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయమూర్తి ఎం.మహతి జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మన దేశమని, యావత్ ప్రపంచానికి ప్రజాస్వామ్య విలువలను అందించడంలో అగ్రరాజ్యాంగంగా నిలిచిందని అన్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేఎస్ఎంవీ నాయుడు, సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దీన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ గాలి నాగరాజు, జాయింట్ సెక్రటరీ యలవర్తి శ్రీనివాసరావు, కోశాధికారి చీమకుర్తి బ్రహ్మం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దండే వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావు, న్యాయవాది కె.సుందరరెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ వినుకొండ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల పిరమిడ్ విన్యాసం

జిల్లా కోర్టు ప్రాంగణంలో...

నరసరావుపేటటౌన్: పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ ఎగురవేశారు. రాజ్యాంగం ప్రాముఖ్యతను ఆమె వివరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు పూర్ణిమ, మధుస్వామి, ఆశీర్వాదం పాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జాతీయ జెండాను డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. టూటౌన్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాలను ఆయా స్టేషన్ల సీఐలు హైమారావు, విజయ్‌చరణ్‌లు ఎగురవేశారు. అదేవిధంగా ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ ఎగురవేశారు.


జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ


జెండావందనం చేస్తున్న డీఎస్పీ కె.నాగేశ్వరరావు


వినుకొండ కోర్టు ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి మహతి


రొంపిచర్లలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న తహసీల్దార్ బి.నిర్మల


శావల్యాపురం తహసీల్దార్ కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న డీటీ వెంకట నాగరాజు


నాదెండ్లలో జెండా వందనం చేస్తున్న ఎంపీపీ రాణి, ఎంపీడీపీ స్వరూపరాణి

క్లుప్తంగా

వైద్యశిబిరంలో 223 మందికి పరీక్షలు



నరసరావుపేట: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్యశిబిరంలో 223మంది రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు హాస్పిటల్ ఎండీ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. హాస్పిటల్ డైరెక్టర్ కంజుల కోటిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. 110 మంది పేషెంట్లకు ఎండోస్కోపీ, 200 మందికి రక్త పరీక్షలు, 90 మందికి యాంప్లిఫాన్ సంస్థ సిబ్బంది వినికిడి పరీక్షలు చేసి 10మందికి 30శాతం రాయితీపై వినికిడి మెషీన్‌లు అందజేశారు. ఐదుగురికి న్యూరోల్యాబ్ సంస్థ ప్రతినిధులు తలతిరుగుడు రోగానికి పరీక్షలు నిర్వహించారు. ముక్కులో పాలిప్స్, గొంతు క్యాన్సర్, మాట్లాడే నరాలకు పక్షవాతం, చెవిలో గూబకు రంధ్రాలు, ముక్కు వంకర, ట్యాన్సిల్స్, వినికిడి లోపాలపై రోగాలు గుర్తించామన్నారు. డాక్టర్లు శ్రీవర్షిణి, నాగేశ్వరరావు, విష్ణురాజ్, సుధీర్‌చంద్ర, ఆడియాలజిస్టు కోటేశ్వరరావు, సీఈఓ మస్తాన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి పాల్గొని సేవలు అందజేశారు.

ఏజీపీ జ్ఞానేశ్వరరావుకు ఘన సత్కారం



వినుకొండ(నూజెండ్ల): ఏజీపీ ఎంపికైన న్యాయవాది ఎం.జ్ఞానేశ్వరరావును వినుకొండ నియోజకవర్గ పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘం నాయకులు, సభ్యులు ఆయనను కలిసి దుశ్శాలువా, పూలమాల, మెమోంట్‌తో సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి అనుముల నాగప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షులు చేపూరి వెంకటరంగారావు, అవ్వారు కోటేశ్వరరావు, నీలి తులసీరామ్, పంచుమర్తి శంకర్, తుమ్మా కోటేశ్వరరావు, చేపూరి రమేష్, చేపూరి రంగబాబు, తుమ్మా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రం ప్రారంభం



శావల్యాపురం: 76వ గణతంత్ర దినోత్సవంలో భాగంగా శావల్యాపురంలో పంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంపద కేంద్రం ప్రాంగణంలో జాతీయ జెండాను సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ ఆవిష్కరించి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, వైఎస్సార్ సీపీ నేతలు ముండ్లమూరి అనిల్‌కుమార్, చుండూరి వెంకటేశ్వర్లు, జవంగుల బాబు, పొట్టిపాటి శ్రీను, కొండారెడ్డి, యాగసిరి ఏసురాజు, పంచాయతీ కార్యదర్శి బొడ్డు యాకోబు, కానుగంటి మహేంద్ర, వార్డు సభ్యులు పోట్లూరు ఏడుకొండలు, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్



వినుకొండ(నూజెండ్ల): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రిపబ్లిక్ డే సందర్భంగా డ్రై డే పురస్కరించుకొని దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కారంపూడి రోడ్డులోని అనధికారంగా మద్యం అమ్ముతున్న మహమ్మద్ అలీని అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగింది. అతని వద్ద నుంచి 10 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ నగర సంకీర్తన



నాదెండ్ల: గణపవరం గ్రామంలో లక్ష్మీ తిరుపతమ్మ తల్లి జ్యోతి నగర సంకీర్తన వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆదివారం ఉదయం నుంచే ఆలయం వద్ద అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై లక్ష్మీతిరుపతమ్మ, స్వామివార్ల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. కోలాట ఉపాధ్యాయిని సంధ్య ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఫిబ్రవరి 1న పెనుగంచిప్రోలులో అమ్మవారికి కళ్యాణ మహోత్సవం జరగనున్నందున అమ్మవారికి నగర సంకీర్తన నిర్వహించారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు



యడ్లపాడు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎలాంటి మద్యం, మాంసం విక్రయాలు చేయరాదన్న నిబంధనలు ఉన్నప్పటికీ మండలంలోని మాంసం వ్యాపారులు వీటిని పట్టించుకోలేదు. చికెన్, మటన్ దుకాణాల్లో జోరుగా మాంసం విక్రయాలు జరిగాయి.



యోగాసనాలతో మంచి ఆరోగ్యం

నరసరావుపేట ఈస్ట్: ప్రతిరోజూ యోగా అభ్యసించటం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని వేంకటేశ్వర యోగా సేవాకేంద్రం (మంగళగిరి) ప్రధానాచార్యులు వేంకటేశ్వర గురూజీ తెలిపారు. వేంకటేశ్వర యోగా సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన 183వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం ఆనంద మహోత్సవం నిర్వహించారు. శిక్షణకు హాజరైన అభ్యాసకులను ఉద్దేశించి వేంకటేశ్వర గురూజీ మాట్లాడుతూ, సంపూర్ణ ఆరోగ్యం, ఆయుష్షుకు యోగా ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. ప్రతిరోజు యోగా అభ్యసించాలని సూచించారు. శిబిర నిర్వాహకుడు జల్లి శ్రీనివాసరావు, చిలకలూరిపేట యోగా గురువు కాపుగంటి శివప్రసాదు, కనమర్లపూడి శారద, మాగులూరి వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పైసెస్ పార్కులో వర్క్‌షాపు

యడ్లపాడు: మండలంలోని మైదవోలు – వంకాయలపాడు పంచాయతీల పరిధిలో ఉన్న స్పైసెస్ పార్కులో సోమవారం వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు స్పైసెస్ బోర్డు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ నుంచి డైరెక్టర్ ప్రొఫెసర్ జాన్‌మనోరాజ్, అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్రన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నబీరసూల్, గుంటూరు స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ అనస్‌బెబ్బరం హాజరు కానున్నట్లు తెలిపారు.

కల్వర్టు కలవరపెడుతోంది!

మండలంలోని గరికపాడు–పమిడిపాడు గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టు రెండు రోజుల క్రితం దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పాడింది. ఆయా గ్రామాల మధ్య ఉన్న పంచాయతీరాజ్‌కు చెందిన ఈ రహదారి శిథిలమై కూలి, వాహనాల రాకపోకలకు ప్రమాదభరితంగా తయారైంది. చుట్టు పక్కల గ్రామాల నుంచి మండల కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రానికి ఈ రహదారి గుండా రాకపోకలు నిలిచాయని వాహనచోదకులు వాపోతున్నారు. ద్విచక్రవాహనాలు మినహాయించి మిగిలిన వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయంతో పాటు ఇబ్బందులు ఉన్నాయని మరమ్మతులు చేపట్టాలని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

–బొల్లాపల్లి